

కథా కౌముది

# ఆ చోటు ఈ రోజు ఖాళీగా ఉంది

చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

ఆ చోటు ఈ రోజు ఖాళీగా వుంది ................

ఖాళీగా నే కాదు శూన్యం గా, నిస్సహాయంగా వుంది.

ఆ చోటుని నింపుతూ ఒక శాల్తీ కూర్చుంటూ వుండేది, పద్మాసనం వేసుకొని నిశారుగా కూర్చుంటూ వుండేది. ప్రపంచంతో సంబంధం లేకుండా, మనస్సును ప్రశ్నించుకొంటూ అతీతంలో వుండేది. నేను ఆమెను గమనించటం ప్రారంభించి దాదాపు రెండు సంవత్సరాలు అవుతుండోచ్చు. రోజూ ఉదయం మార్నింగ్ వాక్. ఆదివారం నుంచి ఆదివారం వరకు, పౌర్ణమి నుంచి పౌర్ణమి వరకు. విరామం లేకుండా అలసి పోకుండా అలాగే కూర్చొని కనిపించేది.. నాకే అప్పుడప్పుడు విసుగనిపించేది.ఎండ లో, ఎవరికోసమూ ఎదురు చూడకుండా , ఎవరిని పలకరించకుండా, ఏమి మాట్లాడకుండా ......... అట్లా కూర్చునేది. ఆ కూర్చోవడంలో కూడా ఎంత ఓపిక!. అది ఓపిక కాదేమో!? నిర్వేదం అనిపిస్తుంది. ఒక్కో రోజు ఆగి అడిగేస్తే తెలుస్తుంది కదా అని అనిపిస్తుంది మళ్ళా మనకెందుకులే అనిపిస్తుంది.

అదే విచిత్రం పక్క వాళ్ళ జీవితం గురించి తెలుసుకోవాలి అనే ఉత్సాహం అందరి లాగే నాకూ ఉన్నప్పటికీ ......... మరీ ఏమి మాట్లాడకుండా వున్న వ్యక్తితో సంభాషణ ఎలా మొదలు పెట్టేది?? సూటిగా చూసి మాట్లాడాలంటే కొంచం మొహమాటం. అలాగని మాట్లడకుండా ఎలా వదిలేది?? అసలే నేనొక రచయితని. నాకు తెలుసు, నా మనసుకు తెలుసు. ఏమో ఈ శాల్తీని కదిలిస్తే!?.. ఒక కథ రాసేటంతటి విషయం దొరుకుతుందేమో? .నా ప్రయత్నం నేను చేస్తే కదా తెలిసేది.. అనుకోకుండా ఇదిగో ఈ పరిస్థితి తెచ్చింది. ఒక కథను దాదాపు కోల్పోయే పరిస్థితి -.

నేను ఫుల్ టైం రచయతను అయి వుంటే ఈ పరిస్థితి కి వచ్చే వాడిని కాదేమో! నేను పార్ట్ టైం రచయితను. పైగా ఒక ఉద్యోగం వెలగపెడుతూ ఇలా తోచినప్పుడు రాస్తాను కాబట్టి, ఇప్పుడు కథ రాద్దాం అని అనుకున్నాను. కాబట్టి ఇదిగో ఆ చోటు గురించి ఆ శాల్తీ గురించి ఆలోచిస్తున్నాను. లేక పోతే నా తలకాయ నొప్పులు నాకున్నాయి. అసలు నా జీవితమే ఒక గొప్ప కథ. అయితే నన్ను నేను నగ్నంగా ఎక్కడ చూపిచ్చుకోను?? అందుకే ఇంకొకరి గురించి రాద్దాం అని నిర్ణయించు కున్నాను. అయితే ఈ శాల్తీ నే ఎందుకు ఎంచుకున్నాను అని మీకు సందేహం రావటంలో తప్పు లేదు. అది నాకున్న భావ స్వాతంత్ర్యం.... ఇది ఒక పెద్ద పదమే! కాని పెద్ద రచయితను కాగోరి ఇలాంటి “గురు” పదాలు వాడుతున్నా. ఇలాంటి వింత శాల్తీలే కథా వస్తువులుగా వాసికేక్కేది. కావాలంటే ఏ గొప్ప రచయిత కథలయినా చూడండి. ఒకానొక జీవితాన్ని తమ దృష్టితో చూసి విశ్లేషించాలి.

ఇక విషయానికి వద్దాం. ఇప్పుడు సమస్యలో వున్నాం. ఆ చోటు ఖాళీ అయివుంది.. నా కథా వస్తువు కనపడటం లేదు. ఇదో పెద్ద సమస్య ........ శూన్యం లోంచి విభూతి సృష్టించే శక్తి నాకు లేదు. మరి ఏమి చెయ్యాలి ?? అక్కడున్న చెట్టు-పుట్ట , గొడ్డు-గోదా , పక్షి-పురుగు , ఆకాశం-భూమి ఎవరినడిగితే నాకు సమాధానం దొరుకుతుంది ?? ఎలా దొరుకుతుంది. దొరికే వరకు ప్రయత్నం చెయ్యాలి. టీ కొట్టు దగ్గరికి వచ్చా.

” ఒక లెమన్ టి “

అతను మౌనంగా స్టౌ వైపు చూస్తూ నీళ్ళను మరగ పెడుతున్నాడు. అడగాలా? వద్దా? పెద్ద మీమాంస. సరే ఎమైతే అది.....

" ఏమయ్యా అక్కడ ఒక ముసలామె వుండదేది కదా .....యీ మధ్య ఇక్కడికి రావటం లేదా ?"

ఎంత యాధాలాపంగా అడిగినా. నాకు తెలియకుండానె ఒక ఉత్సుకత..... కథ తెలిసేసు కొని గొప్ప కథ రాసెయ్యాలి అని ఆత్రుత

" ఎవరు సార్ ?? "

ఏమి ఎరుగని అమాయకత్వం పైగా ....... నాకెందుకు లే అన్న ప్రశ్న

"అదిగో ... అక్కడ కూర్చుని. వుండేది... "

ఇంత పరిసరాలను పట్టించుకొని జీవితాలా అని ఒక విసుగు ...కాని .....నాకెమొ సమాధానం అత్యవసరం. దాని మీద ఎన్నో విషయాలు ఆధారపడి వున్నాయి.

" ఇది గొంది సార్ ....."

టీ అందించాడు. నా ప్రశ్నకు సమాధానం దొరకలేదు. చేతికి టీ మాత్రం దొరికింది. సరే ఏం చేస్తాం! నిరాశగా టీ చప్పరించటం మొదలు పెట్టాను.

అవును.. ఆ చోటు ఎందుకు ఖాళీగా వుంది??? మరొకరు ఎవరూ ఆ స్థానాన్ని ఎందుకు తీసుకోలేదు??

అబ్బ ..... యీ ప్రశ్నలకి సమాధానం ఎవరు చెపుతారు?? నా చూపులన్నీ అక్కడే వున్నాయి ఆ చోటుని ప్రశ్నిస్తూ ..... గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తూ ......శూన్యంలో ప్రశ్నిస్తూ ....

" సార్ .... " యీ ప్రపంచం లోకి తెస్తూ " పది రూపాయలు " అంటూ యీ మెటీరియలిస్టిక్ అవసరాలని గుర్తు చేసాడు. జేబు లోనించి పది రూపాయలు తీసి ఇచ్చాను. ఇక బయల్దేరదాం అనుకుంటూ గ్లాసు అక్కడ టేబుల్ మీద పెట్టా. దింపుడు కళ్ళెం ఆశతో అతని వైపు చూసాను. అతను తన పని తను చేసుకుంటున్నాడు. ఒక అర్టిస్ట్ లాగా మిల్క్ పాకెట్ లు కట్ చేయడం, ఎత్తి మరుగుతున్న పాలల్లో పోయడం ....గమనిస్తూ నించున్నా. నా ఉనికి అతనిని ఇబ్బంది పెట్టటం లేదు. నేను అనే అహం నాకుంది. ఆ అహాన్ని అతను గుర్తించలేదు. అది నాకు ఇంకా బాధ కలిగించే సమస్య. ఒక చేత్తో గరిట పెట్టి మరుగుతున్న టీ కలుపుతున్నాడు. రెండో చేత్తో అల్లం దంచుతున్నాడు. తను చేస్తున్న పని మీద పూర్తి అవగాహన వున్న వాడిలానే వున్నాడు .... పోన్లే అనుకుంటూ వెనక్కి తిరిగాను. ఇక కథ ముందుకు జరగదు. హఠాత్తుగా ...

మూగ బొమ్మ మాట్లాడింది ........

" ఆవిడతో మీ కేమి పని సార్? "

అవ్యక్తమైన ప్రశ్న ...అవును నాకేమి పని? అసలు పక్కవారి జీవితాలలోకి నేను ఎందుకు తొంగి చూస్తున్నాను??.....ఇప్పుడు నేను ఏమి సమాధానం చెప్పను ??నా మనసుని నేను ప్రశ్నిస్తూ ఆలోచన్లొ వుండగానే ....

" అవిడ ఇప్పుడు రావటం లేదు సార్ ...."

ఆ విషయం నాకు తెలుసు. అదే కదా నాకు కావలిసిన విషయం. ఆవిడ ఇప్పుడు అక్కడ లేదనే కదా నా దుగ్ధ.

" అదే ఎందుకు రావడం లేదు.....?"

తపస్సు భగ్న మైన ఒక రుషి తలెత్తి చూసాడు. దీర్ఘంగా, తీవ్రంగా... .నా అత్మని తరచి చూసే ఒక నిశీత మైన చూపు! మళ్ళా తన తపస్సులోకి వెళ్ళిపోయాడు. ఆ వెనుక కూర్చొన్న ఆమె లేచి నా వైపు చూసి కూర్చొంది. అనవసరమైన విషయంలో కి నేను తొంగి చూస్తున్నానా ?? నా లోని సామాజికుడు నన్ను హెచ్చరించాడు. ఇక చాలు బయలు దేరు. నువ్వూ నీ కథా ........ ఇక చాలు ..... పద ..... పద ....అని తొందర పెట్టింది.

" ఆమె ఒక పిచ్చిది సార్! " వెనకనున్న ఆమె గిన్నె తోముతూ.....నా మనస్సుని తోమేసింది.

అంతే ....అంతే .....పిచ్చిదే ..... లేక పోతే ..... ఒకటే చోటులో....అలా కూర్చొవటం... కదలకుండా కూర్చోవటం. అది పిచ్చి వాళ్ళు చేసే పనే! సందేహం లేదు .....అమ్మయ్య ....నాకు ఒక బరువు తీరినట్టయింది. మనస్సు తేలికయినట్టు అనిపించి వెంటనే గుర్తుకు వచ్చింది. అయితే నా కథ

ముందుకు వెళ్ళటం ఎలాగా?? ఏదొ వెలితి ఇప్పుడు ఎలా..!? నాలోని రచయిత బయటికి ఎలా రావటం ????....మళ్ళా కొత్త కధా వస్తువుని ఎక్కడి నుంచి సంపాదించు కోవాలి ?? ఇప్పుడు ఎలాగ ?? అన్ని ప్రశ్నలే ....మళ్ళా ....మళ్ళా

సరే .... ఆవిడ పిచ్చిదే అనుకుందాం. మరి ఇన్ని రోజులు అక్కడ ఎందుకు కూర్చొంది !? ఇప్పుడు అక్కడి నుంచి ఎందుకు రావటం లేదు! ఇప్పుడు వీళ్ళని అడిగి ఏం తెలుసుకోవాలి?? మళ్ళా సామాజికుడు నిద్ర లేచాడు. ఇక చాలు పద, .పద .... అని తొందర పెట్టాడు. మళ్ళా ఎందుకో ... చిన్న ఆశ. ఏమన్నా తెలుస్తే బావుండు. ఇక వాళ్ళని అడగదలుచు కోలేదు. రచయితగా ఇక నా పాత్ర అరంభమయింది. నేనే ఇక ఆ పాత్రకి ఒక రూపం కలిగించాలి. ఒక కథని నిర్ణయించాలి. ఇక నేను సృజన మొదలు పెట్టాలి. సరే ఆమె జీవితానికి ఎలాంటి ఎగుడు దిగుడులు నిర్మించాలి!? అబ్బో చాలా పనివుంది. తొందరగా వెళ్ళాలి ....వెళ్ళీ ... నా సృష్టి మొదలు పెట్టాలి. బయలుదేరాను .... పది అడుగులు వేశానో లేదో ....అదిగో ....ఆమె ఎదురొచ్చింది. నవ్వుతూ...ఆత్మ విశ్వాసంతో నడుస్తూ ఎదురొచ్చింది. మనస్సు వూర్కో లేదు.... పాత్ర ఎదురొస్తే వూర్కోలేని రచయితలా, నా మనస్సు వూర్కోలేదు. ఇదే సమయం... ముందు పరిచయం చేసుకోవాలి ....

" నమస్తే అండీ "

" నమస్తే చెప్పండి " ...యీావిడ పిచ్చిదా ..... ??

" మీరు రోజూ అక్కడ కూర్చుని ఉండగా చాలా సార్లు చూసాను "

" ఆహ ... ఒ కే ..... అయితే "

" అదే అలా ఎందుకు కూర్చొనే వారు ??"

" -------??"

" క్షమించండి .... మీ వ్యక్తి గతమైన విశయం అయితె చెప్పొద్దు "

" డాక్టర్ ... డీ వైటమిన్ తక్కువైంది అంటే .....రోజుకి ఒక గంట అలా ...కూర్చునే దాన్ని ...... ఏం?"

-.-.-.-.-.-.-.-......

ఇక నేను రచయిత ఎలా అవను ??? ప్రకృతి కూడా నాకు వ్యతిరేకంగానే వుంది ......!!!

★★★

Click here to share your comments on this story